# దోపిడి దొంగలు

## యం. కె. వి. శాస్త్రి

తలుపు తాళంతీసి గదిలోకి అడుగు పెట్టగానే నేలమీద పడిన కవరు నన్ను ఆకర్షించింది. ఘటుక్కున కవరు తీసుకుని తలుపులు మూసి జాగ్రత్తగా కవరు చింపి లోపల వున్న ఆరటావు సైజు కాయితం బైటకి తీశాను.

కవరు మీదవున్న పోస్టల్ ముద్ర చూశాను. క్రిందటి రోజు డెలివరి చెయ్యబడింది కవరు.

అది బాస్ జాన్ దగ్గర్నుంచి వచ్చింది.

కవరు చూడగానే నాకు అర్థమైపోయింది, అది జాన్ దగ్గరనుంచి వచ్చిందని. ఎందుకంటే కవరుమీద ఎడ్రస్ జాన్ ప్రత్యేకంగా టైపు చేస్తాడు.

ఉత్తరం మీద తేదీ వుండదు. ఊరిపేరు అసలే

వుండదు. ఎక్కడనుండి పోస్టుచేసిందో తెలియకుండా ఆర్. యం. యస్.లో పోస్టుచేస్తాడు.

ఈ తరంలో రాసిన విషయాలు కోడ్‌లో వుంది. దాన్ని జాగ్రత్తగా డీకోడ్ చేశాను.

డీకోడింగ్ జాన్ బృందంలో వాళ్ళకి తప్ప ఎవ్వరికి ఏ పరిస్థితుల్లోను అర్థమవదు. ఒకవేళ ఈ తరం పొరపాటుగా ఎవరి చేతుల్లోనేనా పడినా ప్రమాదం వుండదు.

"ఈ నెల పదహారో తారీఖున రాత్రి ఏడు గంటలకి రాజమండ్రి 'అప్సర' హోటల్లో, రూం నెంబర్ 635లో కలుసుకో. మన బృందం అంతా అక్కడ సమావేశం ఔతుంది"—జాన్.

అప్రయత్నంగా వాచీకేసి చూసుకున్నా. డేటెడ్ వాచ్‌లో తారీఖు పదిహేను చూపిస్తోంది. అంటే రేపు రాత్రి అన్న మాట.

నా మనస్సు ఆనందంతో గంతులేసింది. చాలా కాలం తర్వాత జాన్ దగ్గరనుంచి పిలుపు వచ్చింది. ఏదో పెద్ద ప్లాన్ తయారుచేసి వుంటాడు.

అసలు జాన్ తయారుచేసే పథకం పదిలక్షలరూపాయిలకి తక్కువ వుండదు.

ప్లేను ఎంతో అనుభవంతో, పగడ్‌బందీగా తయారు చేస్తాడు. లేకపోతే ఇంతవరకు ఎవరికీ అంతు చిక్కకుండా తిరుగుతున్నాం అంటే మాటలుకాదు.

బంగారం, నల్లమందు, గంజాయి, డైమండ్స్ లాంటివి లక్షల రూపాయిలు స్మగులింగ్ బిజినెస్ చేశాం.

మూడుసార్లు బేంకులు, ఆరుసార్లు జ్యూయలరీ షాపులు ఊడ్చిపారేశాం ఈ రెండేళ్ళ కాలంలోనూ.

అసలు ఈ దొంగతనాలు, దోపిడీలు, మనుషులు చేస్తున్నారా? లేకపోతే ఏ దెయ్యాలో, పిశాచాలో చేస్తున్నాయా? అని ఎటూ తేల్చుకోలేక సందిగ్ధావస్థలో పడి పోయారు జనం.

జాన్‌తో చేతులు కలిపి ఈ రెండేళ్ళకాలంలోనూ, నా వాటాకి, మూడులక్షల రూపాయిలకి పైన సంపాదించాను.

సొమ్ము మంచి నీళ్ళలాగ ఖర్చయింది. ఖర్చయిపోగా, స్థిరాస్తి ఊళ్ళో ఒక మేడ, బేంకులో ఎనభైవేల రూపాయిల బేలన్సు వుంది ఈరోజుకి.

మేము ఎప్పుడు, ఏ పరిస్థితిల్లోను హత్యలు మటుకు చెయ్యలేదు. జాన్‌కి హత్యలు అంటే అసలు కిట్టదు.

నేను జాన్ అనుచరులలో అతిముఖ్యుడిగా, జాన్‌కి కుడిభుజంగా, జాన్ మన్ననలు సంపాదించుకోగలిగేను. అందుకు నాకృషి, పట్టుదల, నేర్పు, చాకచక్యం కారణం అంటాడు జాన్. నేనుగాక జాన్ ఇతర అనుచరులు షరీఫ్, రాజా, రమేష్, రంజిత్‌లు.

గత నాలుగు మాసాలుగా అసలు పనిలేక ఏమీ తోచటంలేదు నాకు.

పని వున్నాలేకపోయినా ఏదో ఊరికి వెళ్ళి నాలుగు రోజులు అక్కడే కులాసాగా గడిపి రమ్మంటాడు. లేకపోతే చుట్టుపక్కలవాళ్ళకి అనుమానం వస్తుంది అంటాడు జాన్.

ఈ మధ్య తిరిగి తిరిగి విసుగెత్తిపోయింది నాకు.

ఇప్పుడు జాన్ ఉత్తరం నాకు మంచి ఖుషీ కలుగజేసింది.

ఫ్రిజ్ లోంచి విస్కీ బాటిల్ తీసి, గ్లాసులో పోసుకుని, సోడా కలిపి తృప్తిగా తాగుతో కూర్చున్నా. చల్లగా వున్న విస్కీ గొంతుక దిగుతూవుంటే హుషారుగా వుంది.

## 2

సాయంత్రం ఆరున్నర అయింది బస్సు రాజమండ్రి చేరేసరికి. శీతాకాలం కనుక అప్పుడే చీకటిపడింది. వీధి దీపాలు వెలుగుతున్నాయి.

వాతావరణం చల్లగా వుంది. నేను మేకప్ తో వేషం బాగా మార్చుకోవడం వల్ల, తెలిసిన వాళ్ళు ఎవరు నన్ను దగ్గరనుంచి కూడా పోల్చుకోలేరు. సిగరెట్ వెలిగించి అప్సర హోటల్ కి నడక సాగించా.

హోటల్ చేరుకుని లిఫ్ట్ లో నాలుగో అంతస్తుకి చేరుకున్నాను. టైము ఆరు యాభైఅయిదు నిమిషాలు అయింది, 635 రూం దగ్గర కొంచెం సేపు నుంచుని నెమ్మదిగా తలుపు తోశాను.

"యస్ కమిన్!" అది జాన్ గొంతుక.

లోపలకు నడిచి తలుపు జార్లేశా. గదిలో అంతా నాకోసం ఎదురు చూస్తున్నారు.

"వెల్ కం టు యు!" అన్నారు అంతా సంతోషంతో.

"గుడ్ మార్నింగ్ టు ఆలాఫ్ యూ" అన్నాను జాన్ పక్కన వున్న సోఫాలో కూర్చుంటూ.

చాలాకాలం తర్వాత కలుసుకున్నందుకు, చాలాసేపు కులాసాగా మాట్లాడుకున్నాం.

జాన్ ఫోన్ చేసి బేరర్ ని పిలిచాడు. బేరర్ కి టిఫిన్, కాఫీకి ఆర్డరు చేశాడు. పావుగంటలో టిఫిన్, కాఫీ పూర్తి చేశాం.

తృప్తిగా సోఫాలో వెనక్కి వాలి సిగరెట్టు వెలిగించాను.

షరీఫ్ వెళ్ళి డోర్ లాక్ చేసి వచ్చి కూర్చున్నాడు.

జాన్ సిగరెట్టు వెలిగించి ఘాటుగా రెండు దమ్ములు పీల్చాడు. మాకు అందరికి చాలా ఆతృతగా వుంది, జాన్ ప్లేను ఏమిటో తెలుసుకోవాలని. మా ముఖాల్లో కనిపిస్తున్న ఆతృత కనిపెట్టి చిన్నగా నవ్వుకున్నాడు జాన్.

"నౌ, కం టు ది పాయింట్!" అన్నాడు జాన్. ముందుకు వొంగుని బ్రీఫ్ కేస్‌లోంచి ఒక 'మేరేజ్ యిన్విటేషన్' బైటకితీసి నాచేతికి అందిస్తో.

నేను జాగ్రత్తగా చదివి, మిగిలిన వాళ్ళకి యిచ్చాను. అది తిరిగి జాన్ చేతిలోకి పదినిమిషాల తర్వాత చేరింది. మాకు అందరికి అది చాలా నిరాశ నిస్పృహాల్ని కలిగించింది.

'ఏదో పెద్ద పథకం వేసి పిలిపించాడు జాన్' అని అనుకున్న మేము, ఏదో పెళ్ళికి హాజరవ్వాలని అనిపించగానే చప్పగా చల్లారిపోయాం. జాన్ అవలిస్తే ప్రేగులు లెక్క పెడతాడు. మా అందరికేసి చూసి, మా అంచనాలని అర్థం చేసుకుని గట్టిగా నవ్వేడు. ఈసారి మరీ ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాం.

జేబులోంచి పెన్నుతీసి యిన్విటేషన్ మీద కొన్ని వాక్యాల కింద అండర్ లైన్ చేశాడు. మళ్ళీ యిన్విటేషన్ నాకు యిచ్చాడు జాన్. అండర్ లైన్ చేసిన వాక్యాలు మాత్రం చదువుకున్నా.

"కృష్ణాజిల్లా లక్ష్మీపురం గ్రామ కాపురస్తులు దివాన్ సాహెబ్ రామకృష్ణయ్యగారి ఏకైక పుత్రుడు చిరంజీవి

రామకృష్ణని, తూర్పు గోదావరి జిల్లా కానుమల్లి గ్రామ కాపురస్తులు శ్రీ జానకిరామయ్యగారి ఏకైక పుత్రిక చిరంజీవి సౌభాగ్యవతి సావిత్రిని యిచ్చి కానుమల్లి కన్యాదాత స్వగృహమందు 19వ తారీఖున వివాహమహోత్సవము నిర్ణయించినారు గాన..."

చదవడం ముగించి యిన్విటేషన్ జాన్‌కి యిచ్చాను.

ఈసారి వాతావరణం చాలా నిశ్శబ్దంగా వుంది. కొంచెం సేపు ఆగి జాన్ చెప్పడం మొదలు పెట్టేడు.

ఈ వివాహం తాలూకు ఆడపెళ్ళివారి తరఫువాళ్ళు మొగపెళ్ళివారి తరఫువాళ్ళు కుబేరులు, కోటీశ్వరులు. పెళ్ళికి ఆడపెళ్ళివారు కట్నకానుకల కింద పదహారు లక్షల రూపాయలు యిస్తున్నారు. దీనినిబట్టి రెండువైపుల వారి బలాబలాలు అంచనా వేసుకోవచ్చు.

లక్ష్మీపురం చాలా చిన్న గ్రామం. అయినప్పటికి అక్కడ ఎంతో అధునాతనంగా మూడు, నాలుగు అంతస్తుల మేడలు పట్నవాసంలో వుండేవాటిని తలదన్నేలా వున్నాయి. ఒక్కొక్కడికి వెయ్యి ఎకరాలకి తక్కువ లేని భూస్వాములు అక్కడ చాలా మంది వున్నారు. అందులో చాలా మంది ఆ చుట్టుప్రక్కల ఊళ్ళల్లోని ఫ్యాక్టరీలలో మేజర్ షేర్ హోల్డర్సు.

ఇటు వ్యవసాయ రంగంలోను అటు వాణిజ్యరంగంలోను బాగా ఆర్జించి లక్షలరూపాయిల నల్లధనం కూడబెట్టి కుబేరస్థానం సంపాదించుకున్నారు.

లక్ష్మీపురం నుంచి ఈనెల పదిహేడవ తారీఖున అంటే మధ్యాహ్నం మొగపెళ్ళివారు వివాహానికి, కానుమల్లికి 'రోడ్ మార్షల్' అనే ఒక లగ్జరీ టూరిష్టుబస్సులో

బయలుదేరుతున్నారు.

రోడ్ మార్షల్‌లో నలభైమందికి తక్కువ కాకుండా ఆడవాళ్ళు మరో పాతిక, ముప్పైమంది దాకా మగవాళ్ళు బయలుదేరుతున్నారు.

మగపెళ్ళివారు పెళ్ళిలో చాలా దర్పంగా, హోదాగా, తమ సిరిసంపదల ప్రదర్శనం కోసం, తమ ఔన్నత్యం చాటుకోవడం కోసం ఆడవాళ్లు, ఉన్న వస్తువులు అన్ని అలంకరించుకుని, మిగిలిన ఆభరణములని తమతో తీసుకుని బయలుదేరుతున్నారు.

నా అంచనా ప్రకారం రోడ్ మార్షల్‌ని దారి మళ్ళించి మన స్వాధీనంలోకి తీసుకుని, ఒక్కొక్కరి దగ్గర నిలువు దోపిడి చేసిపారేస్తే యాభైలక్షల రూపాయాలకి తక్కువ వుండదు.

అందుకు బాగా ఆలోచించి ఒక పటిష్ఠమైన ప్లాను తయారు చేశాను.

అంటూ చెప్పడం ఆపి సిగరెట్ వెలిగించి కొంచెం సేపు మౌనంగా వుండిపోయాడు జాన్ మా అందరికేసి నిశితంగా పరీక్షగా చూస్తూ.

మా అందరి ముఖాలు సంతోషంతో ఆనందంతో వెలిగిపోయాయి. జాన్‌ని అంతా తలోరకంగా అభినందించాం.

ఖాళీ బీర్ బాటిల్ సోఫా పక్కన పెట్టి టిన్నులోంచి సిగరెట్టు తీసి వెలిగించి ముందుకు వొంగేను.

అంతా కుతూహలంగా సర్దుకుని కూర్చున్నాం. జాన్ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

రాత్రి తొమ్మిది అయ్యింది జాన్ చెప్పడం ముగించేసరికి. అంతవరకు రోడ్‌మార్షల్ బయలుదేరడం మొదలు

పెట్టి ప్లాన్ పూర్తి అయ్యేసరికి అంటే మొత్తం అంతా తుడిచి పెట్టేసే వరకు, ఎవరెవరు, ఎప్పుడు, ఎలా, ఎక్కడ ఫీల్డులోకి దిగి, ఎవరిపనులు ఎవరు ఎలా నిర్విఘ్నంగా కొనసాగించాలో వివరించాడు.

జాన్ ఫీల్డులోకి ఆఖర్న వస్తాడు. అంతవరకు రోడ్ మార్షల్ వెనకాలే వేరే కారులో ఫాలోచేస్తూ వస్తూ, అవసరమైన చోట అవతరిస్తూ వుంటాడు.

జాన్ నాకు అందరికన్నా అతిముఖ్యమైన బాధ్యతతో కూడుకున్న పని అప్పగించాడు. నేను మొదటినుంచి చివరి వరకు రోడ్ మార్షల్‌లోనే ప్రయాణం సాగిస్తానన్న మాట.

ఆరోజు రాత్రి జాన్ మాకు గ్రేండ్ పార్టీ అరేంజ్ చేసాడు. అర్ధరాత్రివరకు తాగుతూ కూర్చుని, ఎప్పుడో అర్ధరాత్రి దాటిన తర్వాత మాకోసం ముందుగా రిజర్వు చెయ్యబడిన రూంస్‌లోకి వెళ్ళిపోయాం.

# 3

రోడ్ మార్షల్ మగపెళ్ళివారితో, లగేజ్‌లతో నిండిపోయింది. బయలుదేరడానికి ముందు, బస్సు ముందు కొబ్బరికాయలు కొట్టేరు. హారతులు ఇచ్చారు.

అనుకున్న టైంకన్నా బాగా ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటిగంట, నలభై నిమిషాలకి బయలుదేరింది రోడ్ మార్షల్.

మా కారు ఊరి పొలిమేరల వెనకవున్న సర్వీతోటల వెనక వుంది. కారులో నేను, రాజా, రాంజీ వున్నాము. రాజా స్టీరింగుముందు కూర్చున్నాడు.

నేను బైనాక్యులర్స్‌తో అంతా కారులోంచే గమనిస్తున్నాను.

మొత్తం డెభ్భైనలుగురు ఎక్కేరు. అందులో స్త్రీలు నలభైయిద్దరు; ఒక పురోహితుడు, పదహారు మంది పురుషులు, పదిహేను మంది పిల్లలు, వీళ్ళు కాకుండా ఒక డ్రైవరు, ఒక క్లీనరు.

"మొత్తం మొగవాళ్ళు పదహారుగురేనా?" అన్నాను నాలో నేను గొణుక్కున్నట్టు పైకి.

"ముఖ్యమైన వాళ్ళు, బస్సులో బయలుదేరి వుంటారు! మిగిలినవాళ్ళు రైల్లోనో, బస్సుల్లోనో వెడతారేమో!" అన్నాడు రాంజీ.

"ఎలాగో అలాగ అఘోరిస్తారు కానీ, మరి నేను స్టార్టు చెయ్యనా?" అన్నాడు రాజా.

"యస్" అన్నాను. రోడ్ మార్షల్ ని బాగా దూరం వెళ్ళనిచ్చి, మా కారుని బయలుదేరదీసాం.

విజయవాడ చేరుకునేవరకు మా కారు చాలా దూరంగా వెంబడించింది బస్సుని.

అప్పటికి గంట మూడుంపావు అయింది.

రోడ్ మార్షల్ రింగురోడ్డు దగ్గర ఒక పెట్రోల్ బంక్ దగ్గర ఆగి టేంక్ ఫిల్ చేసుకుంటోంది.

గమ్మున కారు దిగి బంకుకి కొంచెం దూరంలో నుంచుని సిగరెట్టు కాలుస్తున్న డ్రైవర్ దగ్గరకు వెళ్లేను.

"పెళ్ళివారు అనుకుంటాను! ఏ ఊరికి వెడుతున్నారు సార్?" అన్నాను.

"కానుమల్లి" అన్నాడు క్లుప్తంగా.

"మీకు పుణ్యం వుంటుంది. నా భార్యకి చాలా సీరియస్ గా వుందని ఇప్పుడే టెలిగ్రాం అందింది. అదిగో! అదే! ఆ కంపెనీలో పని చేస్తున్నాను నేను. రాజమండ్రికి

యిప్పుడు బస్సుకాని, రైలుగాని లేదు; ఎప్పుడో రాత్రికి తప్ప. త్వరగా వెళ్ళకపోతే ఆఖరి చూపులుకూడా దక్కుతాయో లేవో!'' నా గొంతు చిత్రంగా ఒణికింది. కళ్ళు చెమ్మగిల్లినై కన్నీళ్ళతో.

ఒకసారి తమాషాగా కళ్ళను తుడుచుకుని గొంతు సవరించుకుని ''నన్ను బస్సులో రాజమండ్రి చేర్చండి. మీ ఉపకారం మర్చిపోను. వంద రూపాయలు యిచ్చినా ఏ టేక్సీవాడూ రానంటున్నాడు. ఇవాళ టేక్సీవాళ్ళ యూనియన్ లీడర్ ఎవరో పోయారుట'' అన్నాను.

అంతవరకు విసుగ్గా వింటున్న డ్రైవర్ నాకేసి ఉత్సాహంగా చూశాడు.

ఈ అవకాశం నేను వృధాపోనివ్వ దలుచుకోలేదు. నాకు కావలసినది డ్రైవర్ ఆ మూడ్‌లోకి రావడమే!

''నేను మీకు వందరూపాయలు యిస్తాను. నామాట కాదనకండి!'' అన్నాను డ్రైవర్ చేతిలో వందరూపాయిల నోటు పెట్టి చేతులు పట్టుకుని బ్రతిమాలుతూ.

డ్రైవర్ ఒకసారి చుట్టూచూశాడు. ఛటుక్కున నోటు జేబులోకి తోసేశాడు.

కొంచెం సేపు ఆలోచించి ''మిమ్మల్ని మా కంపెనీ గుమస్తాగా చెప్తాను. ఎవరేనా మిమ్మల్ని అడిగితే మీరు కూడా అలాగే చెప్పండి!'' అన్నాడు రహస్యం మాట్లాడుతున్నట్లు.

''అలాగే మీరు ఎలా చెప్తే అలాగే వింటాను'' అన్నాను వినయంగా.

''గురూ. అరవై కొట్టించాను, బిల్లు కట్టెయ్యి పోదాం!'' అన్నాడు క్లీనర్ వచ్చి.

"సరేపద" అని క్లీనర్‌తో చెప్పి, "మీరు బస్సు దగ్గర వుండండి వచ్చేస్తాం" అని నాతో చెప్పి క్లీనర్ చెవిలో ఏదో గుసగుసలాడుతో ముందుకు నడిచాడు డ్రైవర్.

క్లీనర్ వెనక్కి తిరిగి నాకేసి వెకిలిగా నవ్వాడు. నేను కూడా నవ్వేను.

డ్రైవర్ బస్సు స్టార్టు చేశాడు. "ఒరేయ్! గుమాస్తా గారు ఎక్కడరా? త్వరగా రమ్మని చెప్పు!" అని అరిచేడు.

"ఇదిగో వచ్చేశాను, పోనియ్యి, ప్రొప్రయిటర్ గారితో ఫోన్‌లో మాట్లాడుతూ వుండిపోయా యింతసేపూ!" అని బస్సులో అందరికి వినిపించేలాగ అరిచాను.

బస్సులోని పెళ్ళివారు అంతా నాకేసి ఒక్క క్షణం చూసి, మళ్ళీ వాళ్ళ కబుర్లలో వాళ్ళు పడిపోయారు.

నా సమయస్ఫూర్తికి డ్రైవర్ తృప్తిగా నవ్వేడు.

క్లీనర్ మటుకు వెకిలినవ్వు మానలేదు.

## 4

నిడమానూరు దగ్గర లెవెల్ క్రాసింగు గేటు మూసి వుంది. దూరంగా ఎక్కడో గూడ్స్ కూత వినిపించింది.

డ్రైవర్, క్లీనర్‌తోపాటు నేనుకూడా కిందకి దిగేను.

అప్పుడు చూశాను, దూరంగా రోడ్ మార్షల్‌ని వెంబడిస్తో వస్తున్న కారు ఒక పక్కన ఆగివుంది. కారులో స్టీరింగుముందు రాజా కూర్చునవున్నాడు. పక్కన రాంజీ, వెనకసీట్లో జాన్.

చేతులతో రహస్యంగా కోడ్‌లో సిగ్నల్ ఇచ్చాను, ఒ.కె. అని. జాన్ కూడా ఒ.కె. అని రిప్లై యిచ్చాడు.

రోడ్ మార్షల్ ఏలూరు పొలిమేరలు దాటుతుంటే

సాయంత్రం ఆరుగంటలు అయింది. వెలుగు బాగా తగ్గి పోయింది.

ఏలూరు, వట్లూరు, లెవెల్ క్రాసింగుల దగ్గర గేట్లు మూసివుండడంవల్ల, ఏలూరులో ఒక అరగంట పెళ్ళివారు సోడాలు, కాఫీలు అని గోలెత్తడంవల్ల, అనుకున్న టైం కన్న బాగా ఆలస్యమైంది.

బస్సులో లైట్లు వెలిగాయి. పెళ్ళివారు ఎంతో ఖుషీగా వున్నారు. కొంతమంది లోకాభిరామాయణంలో పడ్డారు, కొందరు జోగుతున్నారు.

అప్పుడు చూశాను నిశితంగా. ఆడవాళ్ళ ఒంటిమీద ఆభరణాలు లైటు వెలుగులో మిలమిలా మెరిసిపోతు న్నాయి. నగలతో పొదగబడిన రవ్వలు, రత్నాలు కళ్ళకి మిరుమిట్లు గొల్పుతున్నాయి.

జాన్ ఎలా కనిపెట్టాడో తెలియదు గాని, ఈ బస్సు అంచనాప్రకారం యాభైలక్షుల రూపాయిలకి తక్కువ వుండదు, అని అనిపించింది నా మనస్సుకి.

బాగా చీకటి పడిన తర్వాత డ్రైవర్ కి, క్లీనర్ కి మస్కా కొట్టించి, తప్పించాలి. అంతవరకూ నేను చెయ్య గలిగేది ఏదీలేదు.

ఇంతవరకు డ్రైవర్ కిగాని, క్లీనర్ కిగాని, పెళ్ళివారికి గాని ఏ అనుమానం రాకుండా జాగ్రత్తపడ్డాను.

ఎర్రగా, లావుగా, పొడుగ్గా సూట్ సూట్ లో వున్నాడు పెళ్ళికొడుకు. పెళ్ళికొడుకు చుట్టూ అరడజనుమంది అదే వయస్సు వాళ్లు లోకాభిరామాయణంలో పడ్డారు. స్నేహి తులో, బంధువులో తెలియదు.

ఏడుంపావు చూపిస్తోంది రిష్టువాచ్. బస్సు భీమడోలుకి

ఇవతల, అడ్డరోడ్డు పట్టింది. చీకటి చిక్కగా పరచుకుంది! చుట్టూ గాఢాంధకారం. అప్పుడప్పుడు బస్సో, కారో, అటు ఇటు తిరుగుతున్నాయి.

చలిగాలి రివ్వున వీస్తోంది బస్సులోకి. చుట్టు విండో గ్లాస్ డోర్స్ మూసుకుని కూర్చున్నారు పెళ్ళివారు.

ఆలోచనలతో నా మస్తిష్కం వేడెక్కుతోంది.

రోడ్ మార్షల్ క్రమంగా వేగం తగ్గి ఎడంవేపు రోడ్డుకి ఒక మూలగా ఆగింది.

పరాకుగా వుండడంవల్ల నేను గమనించలేదు. బస్సు హెడ్ లైట్స్‌కి ఎదురుగా ఒక పోలీసు, చేతిలో లాఠీకర్ర. రోడ్డుకి అడ్డంగా నుంచునివున్నాడు.

డ్రైవర్ సీటుడోరు పక్కన యింకో పోలీసు డ్రైవర్‌తో "చెక్ పోస్ట్ యిది. లైసెంసు తీసుకువచ్చి చూపించు" అన్నాడు అధికార స్వరంతో.

బస్సుకి వెనకగా కొంచెం దూరంలో చీకటిగా ఒక లాగవుంది. ఒక హరికెన్ లాంతరు వుంది స్టూలుమీద. చిన్న డ్రాయర్ మీద పుస్తకాలు, కలం, కాయితాలు. చీకట్లో రోడ్డుపక్క ఒక ఆకారం నుంచుని సిగరెట్టు కాలుస్తోంది.

నా బుర్ర చురుగ్గా పనిచేసింది.

డ్రైవర్, క్లీనర్ల వెనకాతలే చెక్ పోస్టుకేసి నడిచాను.

పది నిమిషాలలో మళ్ళీ ముగ్గురం బస్సు ఎక్కేం. బస్సు బయలుదేరింది. క్రమంగా వేగం పుంజుకుంది.

రాజా, రాంజీలు డ్రైవర్, క్లీనర్ల స్థానంలో బస్సులో నాతో చేరిపోయారు.

అక్కడ పాక దగ్గర ఉన్న చెక్ పోస్టు అంతకుముందే జాన్ ఏర్పాటు చేసివుంచాడు.

పోలీసుల వేషంలో వచ్చింది రాజా, రాంజీలు.

డ్రైవర్, క్లీనర్లు, స్పృహ కోల్పోయి, ఒళ్ళు తెలియని స్థితిలో తాళ్ళతో బంధింపబడి కారు వెనక సీటు కింద పడివున్నారు.

బాగా పరిశీలించి చూసినా కూడా కనిపెట్టలేని విధంగా మేకప్ చేసుకుని రూపాలు మార్చుకున్నారు రాజా, రాంజీలు.

సగం పని పూర్తయింది. రోడ్ మార్షల్ మా చేతుల్లోకి మారింది. పావుగంటసేపు నేను, రాంజీ, రాజాలు కోడ్ లో అప్పటివరకు జరిగిన విషయాలు చర్చించుకున్నాం. బస్సులో లైట్లు ఆఫ్ చెయ్యడం వల్ల చీకటిలో ఏం జరుగుతోంది ఎవరికి కనిపించదు.

జాన్ తో హడావిడిగా జరిగిన సంగతులు ఇందాకా చెక్ పోస్టు దగ్గర వివరించాను.

రోడ్ మార్షల్ 'రోడ్ కం రైల్వే బ్రిడ్జి' మీదకి చేరుకునే సరికి తొమ్మిది అయింది.

బస్సులో లైట్లు వెలిగేయి.

పెళ్ళివారు కొత్త బ్రిడ్జిని చూసి ముచ్చటపడిపోతున్నారు. వాళ్ళు ఈ లోకంలో లేరు.

# 5

రాజమండ్రి సిటీలోకి రోడ్ మార్షల్ చేరుకునే సరికి తొమ్మిది పదినిమిషాలు అయింది. సిటీ అంతా వీధిదీపాలతో అందంగా కాంతివంతంగా వుంది.

రోడ్ మార్షల్ కుడివైపుకు తిరిగింది.

హెడ్ పోస్టు ఆఫీసు, గరల్స్ హైస్కూలు, దాటేసి రాజమండ్రి స్టేషన్ మీదుగా సాగిపోతోంది వేగంగా. సిటీ లిమిట్సు దాటేసి ధవళేశ్వరం రోడ్డు చేరుకుంటోంది.

రోడ్డుమీద రద్దీ, వీధిదీపాల కాంతి క్రమంగా తగ్గిపోతోంది.

అప్పుడు ప్రారంభమైంది బస్సులో అలజడి. బస్సు ఆపమని మగవాళ్ళు కొందరు ఒకటే కేక.

హోటల్లో భోజనాలు చెయ్యాలని ఆడవాళ్ళ కేకలు.

పిల్లలు ఈ హడావిడికి, కేకలకి పెద్దగా నవ్వుకుంటున్నారు.

రాజా బస్సు గోలతో సంబంధం లేనివాడిలా దృష్టి రోడ్డుమీదకే కేంద్రీకరించి వుంచాడు. కుడి పాదం కింద ఏక్సిలేటర్ నలిగిపోతోంది. అసలు బ్రేకులమీద పాదం మోపటం లేదు. బస్సు శరవేగంతో ముందుకు దూసుకుపోతోంది.

రామకృష్ణయ్యగారు ఖంగారుగా లేచి నుంచున్నాడు. ఆయనకి ఏదో అనుమానం కలిగినట్టువుంది. నాకేసి ఉరిమి చూస్తూ, డ్రైవర్ సీటుకేసి వడివడిగా నడిచేడు.

"బస్సు ఆపమంటే వినిపించుకోవేం? అసలు ఏమిటి నీ ఉద్దేశ్యం? తప్పతాగి వున్నావా? ఏమిటి యింత స్పీడు. దేనికేనా గుద్దింపగలవు!" గొంతుక చించుకుని అరుస్తున్నాడు.

రాజా ఉద్దేశ్యం వేరు. జాన్ అజ్ఞని తు.చ. తప్ప తప్పకుండా పాటిస్తున్నాడు.

రామకృష్ణయ్యగారు నాకేసి తిరిగేరు. ఆయనకి తోడు పదిమంది ఆడ మగ ఏకమయ్యారు. మూక వుమ్మడిగా

అందరూ సామీద దాడి చేశేరు.

"అసలు బస్సు ఊరిలోకి తీసుకువెళ్ళకుండా, డొంకదారి పట్టిస్తున్నారు! ఏమిటి మీ ఉద్దేశ్యం!" అని అరిచారు.

"వన్ వే ట్రాఫిక్!" రాజా మెల్లిగా గొణిగేడు.

రోడ్ మార్షల్ అప్పటికే ధవిళేశ్వరం పోలీసుస్టేషను, పి. డబ్ల్యూడి, ఆఫీసులు, ట్రావెలర్స్ బంగళా, దాటేసి వేమగిరి రోడ్డు ఎడంవైపుకి తిరిగింది.

మిల్క్ ప్రాజక్టు, పోర్లిక్సు ఫ్యాక్టరీ, గోల్డ్ స్పాటు ఫ్యాక్టరీలని దాటేసి మరో పది నిమిషాలు పరిగెత్తి నిర్మానుష్యంగా, చీకటిగావున్న రోడ్డు పక్కగా ఆగింది రోడ్ మార్షల్. కనుచూపుమేర మనుష్యమాత్రుడు లేడు. మానవసంచారం లేదు.

రామకృష్ణయ్యగారు తోకతొక్కిన త్రాచులాగ లేచాడు. బస్సులో జనమంతా కలిసి మా ముగ్గురి మీద తిరగబడిపోయారు. ఆడవాళ్ళు శాపనార్థాలు పెట్టేస్తున్నారు. ఎవరూకూడా ఒకళ్ళమాట ఒకళ్ళు వినిపించుకునే పరిస్థితిలో లేరు.

ఈ హడావిడిలో బస్సుముందు హెడ్ లైట్ల కాంతిలో వచ్చి ఆగింది ఒక కారు.

అందులోంచి డోరు తీసుకుని కిందికి దిగేడు ఒక పెద్ద మనిషి. పంచ, లాల్చీ, భుజంమీద జరీ కండువా, చేతిలో కర్ర, మనిషి హుందాగా, నిండుగా వున్నాడు.

హడావిడిగా బస్సుదగ్గరకు వచ్చి డోరు తీసుకుని లోపలకి వచ్చి, రామకృష్ణయ్యగారి దగ్గరకు వచ్చి భుజంమీద తట్టుతూ "బావగారూ" అని పిలిచాడు.

నాలుగైదు సార్లు పిలిచిన తర్వాత విసుగ్గా వెనక్కి తిరిగారు.

"క్షమించాలి! నా పేరు లక్ష్మీనారాయణ. పెళ్ళి కుమార్తె పిన తండ్రిని. మీ కాబోయే వియ్యంకుడు జానకి రామయ్య నా పెద్దన్నగారు. నేను వ్యాపార రీత్యా హైదరాబాదులో ఉంటున్నాను. అందుకే యింతకు ముందు తమ దర్శనం చెయ్యలేకపోయాను." అన్నాడు పెద్దమనిషి తరహాలో.

రామకృష్ణయ్యగారు క్షణకాలం ఏదో ఆలోచించారు. ఆయన ముఖం చిరునవ్వుతో వెలిగింది.

"ఔను, నిజమే! మీ అన్నగారు మీ గురించి చెప్పగా విన్నాను. పెళ్ళి చూపుల సమయంలో మనం మసలుకో లేదు. అందుకే మీరు ఎవరో తెలుసుకోలేకపోయాను" అన్నారు మర్యాదగా.

"చాలా సంతోషం! అన్నట్టు ఏమిటి ఏదో ఘర్షణ పడుతున్నట్టున్నారు?" అన్నాడు లక్ష్మీనారాయణ.

రామకృష్ణయ్యగారు మళ్ళీ కోపంగా గంభీరంగా మారి పోయారు.

"చూడండి బావగారూ! ఈ డ్రైవర్ బస్సు ఊళ్ళోకి పోనివ్వకుండా పుంతదారి పట్టి, నిర్మానుష్యంగా ఉన్న ఈ స్మశానంలోకి మళ్ళించాడు! ఎప్పుడో మధ్యాహ్నం తిన్న మెతుకులు. పిల్లలు ఆడవాళ్ళు ఆకలితో అల్లాడి పోతున్నారు. డ్రైవర్ అసలు మాట వినిపించుకోడు! ఏమిటయ్యా ఇది? అని ఆ గుమాస్తాని అడిగితే నీళ్ళు నములుతాడు. వన్ వే ట్రాఫిక్ అంటాడేమిటండీ! అసలు ఎలా తీసుకు వెడదామని ఊళ్ళోకి?" అన్నారు.

"క్షమించాలి! ఈ హడావిడిలో నేను వచ్చిన పని మర్చిపోయాను. మీరు కానుమల్లి చేరుకు నేసరికి బాగా

ఆలస్యమైపోతుంది. అందుకని మీకు అందరికీ భోజన సదుపాయాలు, ఇక్కడ మన బంగళాలో ఏర్పాటు చెయ్యమని మా అన్నగారు నన్ను ఇక్కడకు పంపించారు. ఉదయం ఇక్కడకు వచ్చి ఆ ఏర్పాట్లన్నీ స్వయంగా చేసి మీకోసం బ్రిడ్జిమీద ఎదురు చూస్తో కూర్చున్నాను. అనుకున్న సమయానికి కొంచెం ఆలస్యమైనా మీరంతా వచ్చేరు. మిమ్మల్ని కలుసుకోగలిగినందుకు చాలా సంతోషం. అన్నట్టు అటువైపు సిటీలోకి వెళ్ళే మెయిన్ రోడ్డు రిపేర్‌లో ఉంది. పైగా అది వన్ వే ట్రాఫిక్. ఇది డ్రైవర్ తప్పు కాదు లెండి!

"అయినా ఈ విషయం వారితో చెప్పవచ్చుగా? ఏమిటి నీ తల బిరుసు? ఆయన ఎవరు అనుకున్నావు? ఫూల్!" అని డ్రైవర్‌ని ఒక దులుపు దులిపి, మళ్ళీ రామకృష్ణయ్యగారి వైపు తిరిగి "బావగారు క్షమించి వదిలెయ్యండి వాణ్ణి" అని బస్సులో అందరివైపు చిరునవ్వుతో చూసి "ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది! ఇక బయలుదేరుదాం, ఒక పది నిముషాలలో బంగళాకి చేరవచ్చు" అన్నాడు.

"డ్రైవర్! బస్సు నా కారు వెనకాలే పోనియ్యి, ఊ! త్వరగా" అని బస్సు దిగి కారు ఎక్కేరు లక్ష్మీనారాయణ.

కారు కదిలింది. రోడ్ మార్షల్ కారుని అనుసరించింది.

లక్ష్మీనారాయణగా పరిచయం చేసుకుని అద్భుతంగా నటించిన పాత్రధారి జాన్.

జాన్ సమయస్ఫూర్తికి, నటనకి, నేను ఎంతో ఆశ్చర్యపోయాను.

నిమిషాలమీద వేషం, భాష మార్చి పాత్రలలో పర కాయ ప్రవేశం చెయ్యడం, జాన్‌కి భగవంతుడు యిచ్చిన వరం.

కారు 'హుకుం పేట' రోడ్డు దాటి, ఐ.యల్.టిడి. రిసెర్చి లేబొరెటరీస్ మీదుగా సాగి పోతోంది. అక్కడికి మూడు మైళ్ళ దూరంలో గ్రేండ్ ట్రంకు రోడ్డు, సెంట్రల్ జైలు ఉన్నాయి. మూడు మైళ్ళ వెనక, ముందు ఊరు లేకపోవడం వల్ల జనసంచారం లేదు.

కారు తారురోడ్డు దిగి మట్టి రోడ్డు పట్టింది. తారు రోడ్డుకి మైలు దూరం మట్టి రోడ్డుమీద ప్రయాణించింది. అక్కడ ఉంది ఒక టొబేకో గోడౌన్. అది సీజన్‌లోనే ఉపయోగిస్తారు. అన్‌సీజన్‌లో గోడౌన్ తాళాలు వేసి ఉంటుంది. రాత్రులు ఒక వాచ్‌మెన్ మటుకు ఉంటాడు.

జాన్ వాచ్‌మెన్‌ని మధ్యాహ్నమే జాగ్రత్తగా తప్పించి మారు తాళాలతో గోడౌన్ తెరిపించి, అక్కడ శుభ్రం చేయించి ఉంచాడు. ఈ ఏర్పాట్లకి షరీఫ్, రమేష్ లను నియమించాడు.

కారు ఆగింది. దానికి కొద్ది దూరంలో ఆగింది రోడ్ మాస్టర్.

## 6

ఇరవై నిముషాల తర్వాత పెళ్ళివారు గోడౌన్‌లోకి ప్రవేశించారు. చేతులు, కాళ్ళు కడుక్కుని తీరుబడిగా.

గోడౌన్‌లో అన్నివైపులా బరకాలు పరిచి ఉన్నాయి.

విస్తళ్ళలో పూరీలు, హల్వా, లడ్డూలు, మిక్చర్స్, సర్వ్ చేశారు. జాన్ పెళ్ళి పెద్ద కింద హడావిడిగా అటు ఇటు తిరుగుతూ అందరిచేత కొసరి కొసరి తినిపించాడు. పెళ్ళి వారంతా ఆనందంతో, ఆప్యాయంగా ఆవురావురుమని

తృప్తిగా ఫలహారాలు చేశారు, కాఫీలు త్రాగేరు.

అరగంటతర్వాత పెళ్ళివారు ఒక్కొక్కళ్లూ కూర్చున్న చోట్లల్లోనే ఆవలించుకుంటూ నిద్రల్లోకి దిగిపోయారు.

వాళ్ళు తిన్న ఫలహారాలు అన్నిటిలోనూ వోవర్ డోసులో మత్తుమందు కలపబడింది. తెల్లగా తెల్లవారే వరకు ఒక్కడూ నిద్ర లేవడు.

కొంత మంది పెడుతున్న గుర్రుకి గోడౌన్ అంతా మారు మ్రోగిపోతోంది.

ఒక్కడికీ ఒంటిమీద స్పృహ లేదు. సోయ లేదు.

జాన్ ఒకసారి అందరికేసి చూసి తృప్తిగా తల పంకించాడు.

నేను, రాజా, రాంజీ, షరీఫ్, రమేష్, మేము అయిదు గురం మా పాత అవతారాలు చాలించి జాన్ ముందు నిల బడ్డాం.

"మొత్తం పెళ్ళివారు ఎంత మంది లెక్క పెట్టావా?" అన్నాడు జాన్ నాకేసి చూసి.

"మొత్తం డెభ్భై నలుగురు" అన్నాను.

"లెక్కకి సరిపోయారో లేదో, మళ్ళీ ఒకసారి లెక్క పెట్టు!" అన్నాడు.

లెక్క పెట్టేను. అలా నాలుగు సార్లు లెక్క పెట్టేను మొత్తం అరవైతొమ్మిది మంది వస్తున్నారు లెక్కకి. మిగి లిన అయిదుగురు ఏమయ్యారు? నాకు కంగారు బయలు దేరింది.

జాన్ నా దగ్గరికి వచ్చాడు. "ఏ పని చేస్తున్నా కాస్త జాగ్రత్తగా మసలుకోవాలి" అని మెత్తగా మందలించి "వెళ్ళు! వెళ్ళి తోటలో ఉన్న పెళ్ళికొడుకు, వాడి స్నేహితులని తీసుకురా! మీరుకూడా వెళ్ళండి" అని మిగి

లిన వాళ్ళనికూడా హెచ్చరించాడు.

బైటికి బయలుదేరాం. "అలాగే కారు బేక్ సీట్ కింద ఉన్న డ్రైవర్, క్లీనర్ లని కూడా మోసుకు రండి" ఆజ్ఞాపించాడు. జాన్.

గమ్మున బైటికి పరుగెత్తాం.

గోడౌన్ బైట మామిడి చెట్టు కింద జంబుఖానా పరచుకొని పెళ్ళికొడుకు, మిత్రులు కలిసి విస్కీ సేవిస్తున్నారు. సోడాలకి బదులుగా నీళ్ళు కలుపుకుని తాగుతున్నారు. పార్టీ చేసుకుంటున్నారు లాగుంది.

విస్కీనిషాలో కాస్త మత్తుగా ఉన్నారు వాళ్ళు. మాటలు ముద్దగా వస్తున్నాయి.

ముందు నుంచి, జాన్ వీళ్ళని ఒక కంట కనిపెడుతున్నాడన్నమాట.

వాళ్ళని మంచి మాటలతో జాగ్రత్తగా లోపలకి నడిపించాం.

ఈలోగా జాన్ నిద్రపోతున్న వాళ్ళని అందరిని జాగ్రత్తగా మూడు వరుసలుగా సర్దేడు. ఈ సారి వాళ్ళని చూస్తుంటే హాయిగా భోజనం చేసి భుక్తాయాసం తీర్చుకుంటున్నట్టు ఉన్నారు.

జాన్ వాళ్ళయిదుగురికి స్వయంగా ఫలహారాలు అందించి, మంచి మాటలతో అనునయంగా తినిపించాడు.

విస్కీ నిషాతో పాటు, మత్తు అతి త్వరగా పనిచేసింది. పావుగంటలో ఒళ్ళు వాళ్ళ స్వాధీనంలోంచి తప్పుకుంది.

ఈ సారి కారులోంచి డ్రైవర్ని, క్లీనర్ని తీసుకు వచ్చాం. వాళ్ళు యింకా బాగా మత్తులోనే ఉన్నారు. జాన్ వాళ్ళిద్దరికి మెలుకువ రాకుండా మార్ఫియా యింజెక్టు చేశాడు.

"కమాన్ క్విక్!" అన్నాడు జాన్.

చక చక మేము ముందుగా ఆడవాళ్ళ మీద దాడి చేశాం.

చెవులకి ఉన్న దుద్దులు, జూకాలు, మెడలో ఉన్న ఆభరణాలు, నడుములకి ఉన్న ఒడ్డాణాలు, కాళ్ళకి ఉన్న వెండి పట్టీలు, కడియాలు, చేతి వేళ్ళకి ఉన్న ఉంగరాలు ఒకటేమిటి ఆడదాని ఒంటిమీద అగ్గినా విలువ చేసే వస్తువు ఏదీ వదలి పెట్టకుండా, ఆఖరికి మంగళ సూత్రా లతో సహా ఒలిచిపారేశాం.

తర్వాత మగవాళ్ళమీద తిరుగుబాటు మొదలుపెట్టేం. వేళ్ళకి ఉన్న ఉంగరాలు, చేతికున్న వాచీలు, జేబుల్లోని డబ్బు లాగేశాం.

బస్సులో ఉన్న సూట్ కేసులు, సామాన్లు గోడౌన్ లోకి చేర్చి, తాళాలు బద్దలు కొట్టి అందులో ఉన్న మిగి లిన ఆభరణాలు, ఖరీదైన బట్టలు డబ్బు, ట్రాన్సిస్టర్లు, కమేరాలు, టేపు రికార్డర్లు ఒక పక్కన పోగేశాం.

ఒక పెద్ద పెట్టె తాళం ఎంతకీ ఊడిరాలేదు. పది నిమి షాలు తంటాలుపడి తెరిచాం. అందులో పెళ్ళికూతురికి కాబోలు చేయించిన నగలు, ఆభరణాలు వున్నాయి.

వెండి, బంగారం, నగలు, ఆభరణాలు రెండు పెద్ద పెట్టెలలో సర్దేము.

మిగిలిన వస్తువులు మూడు మూటల కింద కట్టేశాం.

పెట్టెలు, మూటలు, కారులోపల డిక్కీలో ఎక్కించి ...యలుదేరాం.

"పెళ్ళివారు మర్నాడు ఉదయం లేచే సరికి బాగా ఎండెక్కిపోతుంది. ఈలోగా మనం చాలా దూరం పారి

పోవాలి" అన్నాడు జాన్.

కారు గ్రాండ్ ట్రంకు రోడ్డు పట్టింది. ఎక్కడా మా వేలిముద్రలు దొరకకుండా అన్నివిధాల జాగ్రత్తపడ్డాము.

కారులో అంతా చాలా ఇరుకుగా సర్దుకుని కూర్చున్నాం కారు అరవైమైళ్ళ స్పీడులో పరుగెడుతోంది.

"టైం ఎంత అయింది?" అన్నాడు జాన్.

"పన్నెండుం పావు!" అన్నాను,

డ్రైవింగ్ సీట్లో షరీఫ్ కూర్చున్నాడు.

"షరీఫ్! తెల్లవారకముందే మనం బేస్ నెంబర్ ఫోర్ కి చేరుకోవాలి. అర్థమైందా?" అన్నాడు జాన్.

"యస్ బాస్! అన్నాడు ఖచ్చితంగా.

బేస్ నెంబర్ ఫోర్ అంటే భీమునిపట్నం అన్నమాట. ఇంతకుముందు బేస్ నెంబర్ ఫోర్ ని చాలా సార్లు ఉపయోగించుకున్నాం. ఏదైనా ప్రమాదం వస్తే సముద్రంలోకి పారిపోవడానికి మాకు ఒక జపాన్ మేక్ సీ బోట్ కూడా వుంది అక్కడ.

రంజిత్ ఇంతవరకు ఎక్కడా కనిపించలేదు నాకు. ఇంతవరకు రంజిత్ కి డ్యూటీ పడలేదు అంటే రేపటినుంచి ఫీల్డులోకి దిగుతాడన్న మాట.

గోడౌన్ లో జరిగిన ఈ దోపిడి రేపు పది గంటల లోపుగా రాకమండ్రి అంతా మారుమ్రోగిపోతుంది. రెండు రోజులపాటు ఇసుక వేస్తే రాలనంత జనం. పోలీసులు, ఫోటోగ్రాఫర్లు, డాక్టర్లు ప్రతికా ప్రతినిధులు అక్కడ హాజరవుతారు. అవసరమైతే పోలీస్ డాగ్స్ కూడా తీసుకురాబడతాయి. డిపార్టుమెంటు యిన్వెస్టిగేషన్ ప్రారంభమౌతుంది.

రంజిత్ పత్రికాప్రతినిధిగా రంగంలోకి దిగుతాడు. అక్కడ జరిగే సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి మాకు వైర్‌లెస్ ద్వారా పంపుతాడు.

పోలీసు డాగ్స్ గాని, పోలీసు డిపార్ట్‌మెంటుగాని, మా ఆచూకి ఏదైనా కనిపెట్టి మాకు ప్రమాదం కలిగే సూచన కనిపించగానే మాకు వార్తలు పంపుతాడు.

రంజిత్ దగ్గరనుంచి వచ్చిన సమాచారం ప్రకారం మా స్థావరం మార్చుకుంటూ జాగ్రత్తపడతాం. ఇది జాన్ మాస్టర్ ప్లాన్‌లో ఒకటి.

చలి విపరీతంగా వుంది. కారు గ్లాస్ విండోస్ పైకి ఎత్తేశాం. డ్రైవింగ్‌లో షరీఫ్ అందెవేసిన చెయ్యి. దూర ప్రయాణాలు చేసేటప్పుడు డ్రైవింగ్ సీట్లో షరీఫ్ వుంటాడు. షరీఫ్ డ్రైవింగ్ అంటే నాకు చెప్పలేని భయం. సామాన్యంగా నిద్రలో గడిపేస్తా. ఎందుకంటే షరీఫ్ డ్రైవింగ్ అంటే కారు రోడ్డుమీద నడవదు. గాల్లో ఎగురుతుంది.

కారు రాజానగరం దాటుతుంటే చిన్నగా కునుకు పట్టింది.

# 7

కారు తెల్లవారుఝామున నాలుగున్నరకి భీమునిపట్నం చేరింది. మా బంగళాకి వెళ్ళి కారు షెడ్‌లో పెట్టేశాం. షెడ్‌లోంచి యింటికి గుమ్మం వుంది. కారులోని సామానులు అన్నీ జాగ్రత్తగా మేడమీదికి చేర్చేశాం.

మధ్యాహ్నం వరకు విశ్రాంతి తీసుకున్నాం. ఒక రోజంతా బాగా అలసిపోయాం కనుక అందరికి బాగా నిద్రపట్టేసింది.

భోజనాలు ముగించుకుని తీరుబడిగా, ఒక్కొక్క వస్తువు బయటకు తీసి మూడుభాగాలుగా చేశాం.

బంగారం, వెండి సామానులు, ఆభరణములు ఒక భాగం. ఖరీదైన చీరలు, బట్టలు ఒక భాగం, కెమెరాలు, వాచీలు, టేప్ రికార్డర్లు, ట్రాన్సిస్టర్లు ఒక భాగం. అన్ని సామానులకి రూపాయలలో విలువ కట్టేం.

వజ్రాలతో, రత్నాలతో తయారు కాబడిన ఒక్కొక్క నగ, ఆభరణం లక్షల విలువ చేస్తాయి.

వజ్రాల స్మగులింగ్ బిజినెస్‌లో ఆరితేరిన జాన్‌కి ఆ నగలు, ఆభరణాలు మతిపోగొట్టినై. ఆశ్చర్యంతో, ఆనందంతో మైమరచిపోయాడు. విదేశాలనుంచి దొంగ రవాణా చెయ్యబడిన వజ్రాలు అవి.

సాయంత్రం వరకు, ప్రతి ఆభరణం నిశితంగా పరీక్ష చేసి వాటి విలువ ఎనభై లక్షల రూపాయలకి ఖరీదు కట్టేడు.

ఇంతకు ముందు మా బృందం ఎన్నెన్నో ఆభరణాలు దోపిడి చేశాం. అప్పుడు జాన్ ప్రతీ నగలలోని రాళ్ళను బద్దలు కొట్టి వేరు చేసి బంగారం కరిగించి కడ్డీల కింద, అచ్చుల కింద తయారు చేసేవాడు. ఈ సారి ఈ ఆభరణాలు అన్నీ విదేశాలకి దొంగ రవాణా చెయ్యాలని జాన్ ఉద్దేశం.

మొత్తంమీద రోడ్ మార్షల్ దోపిడి మాకు ఎనభైఆరు లక్షల రూపాయల మేరకు అత్యుత్తమ ఫలితాన్ని యిచ్చింది.

వెండి, నగలు అన్ని కలిపి జాగ్రత్తగా ఒక పెద్ద పెట్టె

లోను, వాచీలు, కెమేరాలు, ట్రాన్సిస్టర్లు, టేప్ రికార్డర్లు ఒక పెట్టిలోను పెట్టాం.

ఖరీదైన చీరలు, బట్టలు ఒక పెద్ద జేలు కింద కట్టి ఒక గదిలో భద్రపరిచాం.

మాకు ఎప్పటి కప్పుడు రంజిత్ యిన్ఫర్ మేషన్ ఇస్తు న్నాడు వైర్ లెస్ ద్వారా.

పెళ్ళివారు ఎందుకో పోలీసులకి ఎంత నష్టం జరిగిందీ పూర్తి వివరాలు యివ్వలేదు. బహుశా కోల్పోయినది అంతా 'నల్ల ధనం' అనుకుంటాను.

అయితే అనుకోని ఘోరం ఆ మరునాడు జరిగిపోయింది.

మర్నాడు తెల్లవారు జామున మేము ఇంకా నిద్రలేవక ముందే పోలీసు పటాలం అకస్మాత్తుగా మా భవనంపై దాడి చేసి మమ్మల్నందర్నీ అరెస్టు చేశారు. మేము దోచిన సంపదను హాండోవర్ చేసుకున్నారు.

మా విషయం పోలీసులకు ఎలా తెలిసిందో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా నాకు అర్థం కాలేదు. జాన్, ఇతరులు కూడా అదే విస్మయంలో వున్నారు.

తర్వాత కేసు విచారణలో మాకు తెలిసింది—

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో 'రోడ్ మార్షల్' ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ దాటి వస్తుండగా, అప్పుడే డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్ళటానికి స్టేషన్ బయటికి వచ్చిన ఇన్ స్పెక్టర్ షణ్ముగం బస్సులో అలజడి విన్నాడట. అందులో పరిచయమున్న రామకృష్ణయ్యగారి గొంతుకూడా వినిపించడంతో సందేహించి, మోటర్ సైకిల్ మీద మమ్మల్ని వెంబడించాడట. ఆ తర్వాత మా ప్రతి చర్యను అతను గమనిస్తూనే వున్నాడట.

కానీ తను ఒక్కడే అవటం వల్ల మమ్మల్ని వెంటనే అడ్డుకోలేకపోయాడు. భీమునిపట్నం చేరిన తర్వాత స్థానిక పోలీసులతో సంప్రదించి, అదనపు పోలీసు బలగాన్ని రప్పించి, మాపై దాడి జరిపాడు. అందువల్లే రంజిత్ కి యీ విషయాలు తెలిసే అవకాశం లేకపోయింది.

కేసు విచారణ ముగిశాక మాకు ఒక్కొక్కరికి పన్నెండు సంవత్సరాలకు తగ్గకుండా కఠిన కారాగార శిక్ష విధించాడు జడ్జి.

ప్చ్! ఏం చేస్తాం! చేసిన నేరానికి మరి శిక్ష అనుభవించవలసిందే కదా!!!

—: ఐపోయింది :—